

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి, ఆగస్టు 9: జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందారు. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ గురువారం పప్పుశనగ లోడ్‌తో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తోంది. అర్ధరాత్రి సమయంలో ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై, వీఎస్టీ కంపెనీ వద్ద ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్నది. దీంలో లారీ డ్రైవర్ నసీర్(42) అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి సోదరుడు బాబాజాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫుడ్ పాయిజన్



అస్వస్థతకు గురైన జడ్చర్ల బాలుర మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)



భోజనం నాణ్యతగా లేదని కోస్గి మండలం నాచారం వద్ద రాస్తారోకో చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు (ఫైల్)

- ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లు, కేజీబీవీల్లో నిత్యం ఎక్కడో ఒక చోట ఘటనలు
- నాణ్యత లేని సరకులు, వస్తువులతో వంటలు
- ఆ భోజనం తిని అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు
- లోపించిన పరిశుభ్రత.. కలుషిత నీటి సరఫరా
- కలెక్టర్లు, ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలతోనూ మారని సిబ్బంది తీరు
- కొరవడిన పర్యవేక్షణ..
- తరచూ తనిఖీలతోనే పరిస్థితి మెరుగుపడే అవకాశం

మహబూబ్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వారంతా పేద పిల్లలు.. తల్లిదండ్రులకు రెక్కాడితే కానీ డొక్కాడదు. తమ పిల్లలు విద్యావంతులు కావాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి గృహాలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో ఉంచి చదివిస్తున్నారు. హాస్టళ్ల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. నాణ్యమైన భోజనం అందించాలని ఉన్నతాధికారులు కూడా ఆదేశిస్తున్నారు. అప్పుడప్పుడు వాటిని తనిఖీ కూడా చేస్తున్నారు. అయినా ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఎక్కడో ఒక చోట ఆహార కల్తీ జరుగుతోంది. దాంతో విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన దశలోనే ఈ తరహా ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. పాఠశాలలు, ఆసుపత్రులను కలెక్టర్లు తరచూ విజిట్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దాంతో కలెక్టర్లు కూడా క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నారు. కానీ హాస్టళ్లు, గురుకులాల్లో సిబ్బంది తీరు మారడం లేదు. ఇటీవలి కాలంలోనే దాదాపు చాలా ప్రభుత్వ విద్యా సంస్థల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కువగా బాలికల వసతి గృహాల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందని వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎవరినీ లోపలికి రానివ్వకపోవడంతో అక్కడి పరిస్థితి బయటకు వెల్లడి కావడం లేదు. కేవలం విద్యార్థినులు అస్వతస్థకు గురైన సమయాల్లోనే తెలుస్తోంది. కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం పరిసరాలను ముందుగానే శుభ్రంగా ఉంచడం, నాణ్యమైన భోజనం అందించడం వంటివి చేస్తున్నారు. కానీ రోజూ నాణ్యమైన భోజనం అందడం లేదు. హాస్టళ్ల తనిఖీ చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ లేదా నోడల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తే కొంత ఫలితం ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తరచూ జరుగుతున్న ఘటనలతో తమ పిల్లలు ఏం తింటున్నారోనని తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రధానంగా పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, నాణ్యమైన ఆహారం అందకపోవడం, ప్రతీ హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్లు లేకపోవడం, కలుషిత తాగునీరు సరఫరా, మరుగుదొడ్ల సమస్య, స్నానపు గదులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.

సరఫరాదారుల గోల్‌మాల్..

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో ప్రతీ సంవత్సరం కూరగాయలు, ఇతర వంట సామగ్రి కోసం టెండర్లు నిర్వహిస్తుంటారు. సీల్డ్ కవర్లలో టెండర్లను ఆహ్వానించి, కేటాయిస్తున్నప్పటికీ.. కొంత అనుకూలమైన వ్యక్తులకే అవి దక్కుతాయనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో టెండర్లు దక్కించుకున్న వారు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడం లేదు. మార్కెట్‌లో తక్కువ ధరకు దొరికే వస్తువులను కొనుగోలు చేస్తుండటంతో వాటిని తినడం వల్ల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతోంది. కేజీబీవీల్లో అయితే ఎస్‌వోలు, ఇతరత్రా సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం షరా మామూలే. పాడైపోయిన కూరగాయలు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు చాలా చోట్ల వాడుతున్నారు. వంటలు మిగిలితే మరుసటి రోజు ఆహారంలో కూడా వాడుతున్నారని తెలుస్తోంది. నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నంతో కూడా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు పౌరసరఫరాల ద్వారానే బియ్యం సరఫరా అవుతుంటాయి. ఆ బియ్యానికి పురుగులు పట్టినప్పుడు వాటిని శుభ్రం చేయించాలి. ఇంకా ఎక్కువ పురుగులు పడితే ఆ బియ్యాన్ని వండకుండా పక్కన పెట్టాలి. కానీ వంట సిబ్బంది ఇవేవి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం పర్యవేక్షణ డొల్లతనం వల్లనే ఈ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వంటలు చేస్తున్నట్లు తరచూ జరుగుతున్న ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

ఇవీ ఉదాహరణలు..

- ఈ నెల 4న వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వసతి గృహంలో భోజనం సరిగా లేకపోవడంతో 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అన్నంలో పురుగులు వస్తుండటంతో విద్యార్థినులు సరిగ్గా తినలేదు. తిన్నవారికి కడుపు నొప్పి రావడంతో వారికి స్థానికంగా ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. డీఈవో గోవిందరాజులు, మోడల్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసచారి పాఠశాలను తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు.
- ఈ నెల ఎనిమిదిన అచ్చంపేట మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆ పాఠశాలలో 525 మంది విద్యార్థులు ఉండగా.. 43 మంది వాంతులు చేసుకున్నారు. వారిని ఆస్పత్రులకు తరలించారు. కుళ్లిన కూరగాయలు, చెడిపోయిన ఆహార పదార్థాలను వాడటం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యిందని తెలిసింది.
- ఈ నెల నాల్గో తేదీన పెంట్లవెల్లి కేజీబీవీలోని 328 మంది విద్యార్థులకు గాను 47 మంది ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. వారిని కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఐదో తేదీన కలెక్టర్ బదావత్ సంతోష్ పాఠశాలను తనిఖీ చేశారు. ఎస్‌వో, ఐదుగురు వంట సిబ్బందిని సస్పెండ్ చేశారు. పాఠశాలకు ఒక వాటర్ ప్లాంట్‌ను అందజేశారు.
- ఈ నెల ఏడున జడ్చర్ల మునిసిపాలిటీలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ అయ్యింది. 250 మంది విద్యార్థులకు గాను 49 మంది కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. తొమ్మిది మంది విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.
- కోస్గి మండలం నాచారంలో ఉన్న కేజీబీవీలో భోజనం నాణ్యతగా పెట్టడం లేదని విద్యార్థులు ఈ నెల మూడో తేదీన రాస్తారోకో చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, జీసీడీవో పద్మానళిని, విద్యాశాఖ జేడీ రాజీవ్ పాఠశాలను తనిఖీ చేశారు. ఎస్‌వో విజయతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్ చేశారు. వంట మనిషి, సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించారు.
- గట్టు మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో గతంలో పలువురు విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయ్యింది. వారందరినీ గద్వాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇక్కడ గురువారం ఓ ఇంటర్ విద్యార్థిని కూడా అస్వస్థతకు గురైంది. అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



అచ్చంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు(ఫైల్)

- బల్మూరు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మంచినీటి కలుషితం వల్ల 2021 సంవత్సరంలో ఆరు మంది అస్వస్థతకు గురయ్యారు.
- నవాబ్‌పేట మండలంలోని కేజీబీవీలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హన్వాడ మండల కేంద్రంలోని వసతి గృహంలో అప్పుడప్పుడు పురుగులు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. బాలానగర్ మండలంలో ఎస్సీ వసతి గృహంలో వసతులు సరిగా లేవు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కూరగాయలు, బియ్యం నాణ్యతగా ఉండటం లేదు.
- వనపర్తి జిల్లా అమరచింత కేజీబీవీలో కూడా గతంలో ఆహార కల్తీ, కలుషిత నీటిని తాగడం వల్ల విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పట్లో అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీలో కుళ్లిపోయిన క్యాబేజీ(ఫైల్)

చదువు, సంస్కారంతోనే ఆదివాసీల అభివృద్ధి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- అలరించిన చెంచు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

మన్ననూర్, ఆగస్టు 9: చదువు, సంస్కారం, యాక్టివిటీలతోనే ఆదివాసీ చెంచులు అభివృద్ధి చెందుతారని కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ వేడుకలకు కలెక్టర్, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెంచులు డప్పు వాయిద్యాల నడుమ అంబేడ్కర్ కూడలి నుంచి గిరిజన భవన్ వరకు కలెక్టర్‌తో కలిసి మొదట ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ సంతోష్‌లు అధికార యంత్రాంగంతో కలిసి చెంచులక్ష్మి, కొమరంభీమ్‌ల చిత్ర పటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివాసీ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చెంచు చిన్నారులు నృత్యాలు, పాటలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా చెంచు నాయకులు పలు సమస్యలను సభలో పెద్దల దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో సేవలందిస్తున్న వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. చెంచులు ఐకమత్యంతో ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని, తమ దృష్టికి తీసుకురా కుండానే చెంచులు పాదయాత్రకు పూనుకోవడం సరికా దన్నారు. చెంచుల సమస్యలు పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. చెంచులక్ష్మి మ్యూజియాన్ని 2007లో తామే నిర్మించామని, మళ్లీ పునర్నిర్మించి మహిళా శక్తి క్యాంటీన్‌గా అభివృద్ధి చేసి చెంచు మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. మన్ననూరులో ఆదివాసీ భవన్ ఏర్పాటు చేస్తామని, వచ్చే ఏడాది ఆదివాసీ దినోత్సవ వేడుకలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరిజన భవన్‌కు వంటశాల, ప్రహరీ గోడల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఇల్లు లేని చెంచులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలను చర్చించుకునేందుకు, ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అమరులైన వీరుల పోరాటాలను స్మరించుకునేందుకు 2004 నుంచి ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. చెంచులకు ఆధార్‌కార్డులను జన్‌మన్ పథకంలో అందజేస్తున్నామని, అర్హులైన వారికి రేషన్ కార్డులను అందించే ప్రక్రియకు త్వరలోనే ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని తెలిపారు. చదవుపై ప్రత్యేక దృష్టి సారించి అత్యున్నతమైన పోస్టుల్లో ఆదివాసీ బిడ్డలు నిలబడాలని కోరారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫిరంగి, ఆర్డీవో మాధవి, జిల్లా ఉప వైద్యాధికారి తారాసింగ్, తహసీల్దార్ రవూఫ్, ఎంపీడీవో చాలచంద్ర సృజన్, చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగయ్య, చెంచు నాయకులు దాసరి రాజేంద్రప్రసాద్, దాసరి శ్రీనివాసులు, నిమ్మల శ్రీనివాసులు, పెద్దిరాజు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



అటవీ ఉద్యోగికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



పదర మండలం పెట్రల్ చెంచుపెంటలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకుంటున్న చెంచు గిరిజనులు

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

అమ్రాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అమ్రాబాద్, పదర మండలాల పరిధిలో శుక్రవారం ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పదర మండల పరిధిలోని పెట్రాల్ చెంచుపెంటకు చెందిన ఆదిమ జాతి చెంచు గిరిజనులు మొదటగా అడవి తల్లికి పూజలు నిర్వహించి ఆదివాసి సంప్రదాయ పద్ధతుల్లో వేషధారణతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచు ఐక్య వేదిక పదర మండల కన్వీనర్ మండి ఆంజయ్య మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కూడా చెంచులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారికి రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను కల్పించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెంచు ఐక్యవేదిక, చెంచు మహిళలు పాల్గొన్నారు.

ఆ తేళ్లు కుట్టవు

- కర్ణాటక రాష్ట్రం కందుకూర్‌లో తేళ్ల పంచమి
- వింత ఆచారాన్ని చూసేందుకు తరలివచ్చిన జనం



యువతి చెంపపై ఉన్న తేలు

నారాయణపేట, ఆగస్టు 9 : నారాయణపేట జిల్లా కేంద్రానికి సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ తాలుకా కందుకూరు సమీపంలోని కొండమవ్వ గుట్టపై శుక్రవారం తేళ్ళ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నాగ దేవతకు పూజలు నిర్వహించి నాగుల పంచమిని ఘనంగా నిర్వహించుకుంటే ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా తేళ్ళ పంచమిని గ్రామస్థులు నిర్వహించుకోవడంతో ఈ వింత ఆచారాన్ని చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కొండమ్మవ్వ గుట్టపై కొలువు దీరిన తేళ్ల దేవతకు పాలుపోసి పూజలు చేశారు. అనంతరం చిన్నాపెద్ద అన్న తారతమ్యం లేకుండా కొండ రాళ్ళను కదిలించి వచ్చిన తేళ్ళను పట్టుకొని వాటితో సరదాగా ఆడుకున్నారు. చేతులు, నాలుక, తలపై తేళ్లను వేసుకొని కేరింతలు కొట్టారు. తేళ్ల పంచమి పూర్వం నుంచి ఇక్కడ ఆచారంగా కొనసాగుతోంది. ఇక్కడి తేళ్లు కుట్టవని కుట్టినా దేవత దగ్గర ఉన్న విభూదిని అంటిస్తే చాలు ఏమీకాదని చెబుతారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు అన్నదానం కూడా చేశారు.



బాలుడి వీపుపై ఉన్న తేలు

నిజాయతీని చాటుకున్న మహెమూద్

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 9 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో రెండు రోజుల క్రితం జొన్నలబొగుడ తపాలా ఉద్యోగి సమత తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నది. దాదాపు 20వేలకు పైగా విలువ గల మొబైల్‌ను పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన మహెమూద్‌కు దొరికింది. మొబైల్‌ను తపాలా ఉద్యోగి సమతకు శుక్రవారం అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితురాలికి అప్పజెప్పి నిజాయతీని చాటుకున్న అతడ్ని తపాలా సిబ్బంది, సమత, గోపాల్‌రావు అభినందించారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛ్‌ఆఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

గుంపుమేస్త్రి చెర నుంచి భార్యను విడిపించాలని భర్త వేడుకోలు


అనారోగ్యంగా ఉన్న కుమారుడితో బాధితుడు తప్పెట రాములు

బిజినేపల్లి, ఆగస్టు 8 : మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన తప్పెట రాములు అలియాస్ కురుమయ్య అనే వ్యక్తి భార్య ఎల్లమ్మతో కలిసి కొంతకాలం నుంచి గుంపు మేస్త్రి రామస్వామి వద్ద వలస కూలీలుగా పని చేస్తున్నారు. నెల రోజుల క్రితం స్వంత కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటికి వెళ్లి వస్తానని చెప్పినా.. గుంపు మేస్త్రి మానవత్వం మరిచి ఇంటికి వెళ్లేందుకు అనుమతి నిరాకరించాడు. చేసేదిలేక పారిపోయి వచ్చి అనారోగ్యం పాలైన నాలుగేళ్ల కుమారుడికి ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. విషయం తెలుసుకున్న సంబంధిత గుంపు మేస్త్రి అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులు ఇవ్వనిదే భార్య ఎల్లమ్మను పంపనని వేధిస్తున్నట్లు బాధితుడు శుక్రవారం వాపోయాడు. వనపర్తి జిల్లా అచ్యుతాపురం గ్రామానికి చెందిన గుంపు మేస్త్రి రామస్వామి వద్ద ఉన్న తన భార్య ఎల్లమ్మను పంపించమని తప్పెట రాములు వేడుకుంటే బూతులు తిట్టడంతో పాటు మానసిక వేధింపులకు పాల్పడుతున్నాడని వాపోయాడు. తనకు ఇవ్వాల్సిన బాకీ నగదు అప్పో సొప్పో చేసి కట్టేస్తానని తన భార్యను ఇంటికి పంపిస్తే అనారోగ్యంతో ఉన్న కుమారుడి బాగోగులు చూసుకుంటుందని ఎంత వేడుకుంటున్నా పట్టించుకోకుండా అమానుషంగా వ్యవహరిస్తున్న గుంపు మేస్త్రి నుంచి భార్య ఎల్లమ్మను విడిపించడంతో పాటు రక్షణ కల్పించాలని బాధితుడు కోరుతున్నాడు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 9 : మైనారిటీస్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ (బాలుర)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధికారి ఆర్. ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న మైనార్టీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రూ. లక్షా యాభై వేల వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థులు తెల్లరేషన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, ఆధార్, టీసీ, బోనఫైడ్ ధ్రువపత్రాల జిరాక్స్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో మైనార్టీ సంక్షేమాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9491486472 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కారు, బైకు ఢీ - వ్యక్తికి గాయాలు

జడ్చర్ల, ఆగస్టు 9 : మండలంలోని గొల్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న బైకును, కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామానికి చెందిన చెన్న కేశవులుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైకును వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బైకు సుమారు 5 ఫీట్ల మేర ఎగిరి రోడ్డు డివైడర్ మధ్యలో పడింది. బైకుపై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు వివరించారు.


కారు ఢీ కొట్టడంతో రోడ్డు డివైడర్ మధ్యలో పడిన బైకు

యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడికి ఐదేళ్లు జైలుశిక్ష

- కేసు వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, ఆగస్టు 9 : తననే పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపేస్తానని బెదిరించి యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు నిచ్చారు. కేసు వివరాలను ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. 2020, డిసెంబర్ రెండున జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో బోయ కృష్ణ అనే యువకుడు లోనికి ప్రవేశించాడు. తననే పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపిస్తానని ఆమెను బెదిరిస్తూ ఇంటి తలుపులు మూసివేశాడు. ఆమె తలుపులు తెరిచేందుకు యత్నించగా అతడు అడ్డుకున్నాడు. కొద్ది సేపటికి యువతి తల్లి పొలం నుంచి ఇంటికి రావడంతో అప్పుడు తలుపులు తెరిచాడు. తలుపులు ఎందుకు వేశావంటూ అతడిని ప్రశ్నించగా, మీ కుమార్తెతో నాకు పెళ్లి చేయాలని చెప్తూ, పారిపోయాడు. విషయాన్ని ఎవరికైనా చెప్తే కుటుంబం పరువు పోతుందని భావించిన యువతి తల్లి, చివరకు ధైర్యం తెచ్చుకొని అదే నెల ఐదవ తేదీన గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనతో మనస్తాపానికి గురైన యువతి ఆ తర్వాత రెండు రోజులకు తమ పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీ ఆదేశానుసారం కేసు ట్రయల్ సమయంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. శుక్రవారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యా యాధికారి గంటా కవితా దేవి ఇరుపక్షాల వాదనలు విన్నారు. నిందితుడు బోయ కృష్ణకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.12,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నేరస్థుడికి శిక్ష పడేలా కృషి చేసి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మణస్వామి, విచారణ అధికారులు హరిప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుళ్లు శివకుమార్, తిప్పన్న, లైజన్ అధికారి లక్ష్మణ్‌లను ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

నంచర్ల గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

మహమ్మదాబాద్, ఆగస్టు 9 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మండల పరిధిలోని నంచర్ల గురుకుల పాఠశాలలో చోటు శుక్రవారం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం గురుకులంలో మెనూ ప్రకారం కిచిడి వడ్డించారు. ఇది తిన్న గంటలోపే సుమారు 20 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. విషయం బయటకు పొక్కకుండా అక్కడి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు జాగ్రత్తపడ్డారు. గ్రామంలో ఉన్న వైద్యసిబ్బందిచే విద్యార్థులకు చికిత్స చేయించారు. కొన్నిరోజులుగా విద్యార్థులు కలుషిత నీరు వస్తుందని కొందరు విద్యార్థులు చెపుతున్నారు. భోజనం కూడా మెనూ ప్రకారం ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులకు కొన్ని రోజుల నుంచి విద్యార్థులకు మంచి భోజనం అందించడంలేదని తెలిపారు. విషయాన్ని విద్యార్థులు ఎవరూ బయటికి చెప్పవద్దంటూ ఉపాధ్యాయులు విద్యార్థులకు హుకుం జారీ చేశారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి
- పీయూలో ప్రారంభమైన పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు


పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 9 : మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులను హెచ్చరించారు. శుక్రవారం పాలమూరు యూనివర్సిటీ, అనుబంధంగా ఉన్న పీజీ కళాశాల విద్యార్థులకు పీజీ ఎంఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంకామ్, ఎస్‌డబ్ల్యూ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రార్ తెలిపారు.

గొర్రె పొట్టేళ్లపై దూసుకెళ్లిన సిమెంట్ ట్యాంకర్

-12 పొట్టేళ్లు మృతి, గాయపడిన మరో 20 జీవాలు


పెద్దకొత్తపల్లిలో సిమెంట్ ట్యాంకర్ కింద పడి మృతి చెందిన గొర్రె పొట్టేళ్లు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 9 : మేతకు వెళ్లి తిరిగి మందకు చేరుకుంటున్న గొర్రె, పొట్టేళ్ల గుంపుపై అతివేగంగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్(లారీ) దూసుకెళ్లిన సంఘటనలో 12 పొట్టేళ్లు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. మరో 20 పొట్టేళ్లు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన శారద మల్లయ్య, గోపాల చిన్నబాలయ్య తమ గొర్రెపొట్టేళ్ల మందను మేపుకు రావడానికి పంట పొలాలకు తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి పెద్దకొత్తపల్లిలోని గొర్రెల పాకకు తీసుకొస్తుండగా ఎంపీడీవో కార్యాలయం ముందు గొర్రెపొట్టేళ్ల గుంపు రోడ్డు దాటుతుండగా నాగర్‌కర్నూల్ నుంచి టీఎస్ 29టీఏ 0637 నెంబరు గల మహాసిమెంట్ ట్యాంకర్ కొల్లాపూర్ వైపు గజ కంపెనీ దగ్గరకు వెళ్తుండగా అతివేగంగా వెళ్తూ గొర్రెలగుంపుపై దూసుకెళ్లింది. దీంతో 12గొర్రె పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందగా మరో 20గొర్రె పొట్టేళ్లు తీవ్రంగా గాయపడ్డాయి. మృతి చెందిన, గాయపడిన గొర్రె పొట్టేళ్ల విలువ దాదాపు 5లక్షల రూపాయలు ఉంటుందని బాధితులు వాపోయారు. ఈ సంఘటనపై గొర్రెల పెంపకందారులు స్థానిక పోలీసులకు సమాచారమివ్వడంతో సిమెంట్ ట్యాంకర్‌లారీని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సతీష్ తెలిపారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన డీకే అరుణ

- అరుణను సన్మానించిన దత్తాత్రేయ


ఢిల్లీలో హర్యానా గవర్నర్ దత్తాత్రేయను కలిసిన ఎంపీ డీకే అరుణ తదితరులు

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్)/ నారాయణపేట టౌన్, ఆగస్టు 9 : మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఎంపీ డీకే అరుణను హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అభినందించారు. శుక్రవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, నాగేశ్‌లు హర్యానా గవర్నర్ దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో డీకే అరుణ సీఎం రేవంత్ రెడ్డి ఇలాఖాలో గెలవడం అంటే మామూలు విషయం కాదని ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు.

డిప్యూటీ స్పీకర్‌కు ధన్యవాదాలు

పార్లమెంట్ తొలి సమావేశంలోనే పాలమూరు ప్రజాసమస్యలపై డీకే అరుణ గళం విప్పారు. ఉమ్మడి జిల్లాలో సైనిక్ స్కూల్ లేదని, గతంలోనే నారాయణపేట జిల్లాలో ప్రతి పాదించినప్పటికీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అక్కడే ఏర్పాటు చేయాల్సిన ఆవశ్య కత, అవసరం ఎంతో ఉందని సభద్వారా కేంద్ర రక్షణ శాఖ మంత్రిని కోరినట్లు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కల్పించిన డిప్యూటీ స్పీకర్‌కు పత్రికాముఖంగా డీకే అరుణ ధన్యవాదాలు తెలిపారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యల పోస్టుపై కేసు నమోదు

జడ్చర్ల, ఆగస్టు 9 : సామాజిక మాధ్యమంలో ఓ వ్యక్తి రెచ్చగొట్టేవిధమైన వ్యాఖ్యలతో పాటు కాంగ్రెస్ పార్టీని అవమానపరుస్తూ మెసేజ్ పెట్టారంటూ జడ్చర్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తుల బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. రాబోయే సర్పంచ్ ఎలక్షన్స్‌ను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్‌పార్టీని అవమానిస్తూ, ఓ జాతీయ పార్టీకే ఓటు వేద్దాం అంటూ రెచ్చగొట్టేవిధమైన వ్యాఖ్యలతో మెసేజ్ పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టేవ్యాఖ్యలు చేస్తే చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడు


మాకం జీవన్

బిజినేపల్లి, ఆగస్టు 8 : ఒక ప్రభుత్వ ఉద్యోగం కోసం పట్టువదలని విక్రమార్కుడిలా పోరాటం చేస్తున్న ఒక ఉద్యోగం కూడా రాక చతికిల పడుతున్న వారినే ఎక్కువగా చూస్తుంటాం.. కానీ నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన మాకం జీవన్ అనే యువకుడు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు(ఇరిగేషన్ శాఖలో ఏఈఈ, ఏఈ, పాలిటెక్నిక్ లెక్చరర్, గ్రూప్-4 ఉద్యోగం, ఎస్ఎస్‌సీ జేఈ, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్) సాధించి ఔరా అనిపించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన తల్లిదండ్రులు మాకం లావణ్య, ఆంజనేయులు టైలర్ వృత్తి చేసుకుంటూ కూతురు మహిత, కుమారుడు జీవన్ కుమార్‌ను వారి స్థోమతకు మించి కష్టపడి చదివించారు. ఇంటర్ వనపర్తిలో, బీటెక్ హైదరాబాద్‌లో, ఎంటెక్ హర్యానాలో పూర్తి చేసిన జీవన్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు హాజరయ్యాడు. ఈ మధ్య విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఐదు ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికవ్వడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించడంతో వారి నమ్మకాని వమ్ము చేయకుండా పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన జీవన్ కుమార్ యువతకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు

- కన్యకాపరమేశ్వరి ఆలయంలో నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ



నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 9: నాగుల పంచమి సందర్భంగా పట్టణంలోని శివాలయాలలో భక్తులు పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో నాగదేవతల ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున నాగదేవతలను మేళతాళాలతో తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం కలశపూజ, నవగ్రహ హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హోమంలో పాల్గొని అమ్మవారికి కిలో వెండిని ఎమ్మెల్యే దంపతులు బహూకరించారు.

కేజీబీవీని సందర్శించిన ఎల్లేని



పెంట్లవెల్లి కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

పెంట్లవెల్లి, ఆగస్టు 9: గత వారం రోజుల నుంచి విద్యార్థులు అస్వస్థతకు గురై చికిత్స పొందిన విద్యార్థులను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అనారోగ్యానికి గురి కావడానికి విద్యార్థినులను కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తరగతి గదిలో బెంచీలు కూడా లేవని, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని వారన్నారు. పాఠశాలలో ఇన్ని సమస్యలు ఉంటే కనీసం స్థానిక మంత్రి పరామర్శించకపోవడం దారుణమన్నారు. వంట సిబ్బంది సస్పెండ్ అయిన స్థానంలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా కొత్త వారిని తీసుకోవాలని వారు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, భరత్‌చంద్ర, వెంకటేష్, ఖలీల్ పాల్గొన్నారు.

రైతులకు పాస్ పుస్తకం ఆధారంగా రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్, ఆగస్టు 9 : రైతులకు వచ్చిన పాస్ పుస్తకం ఆధారంగా రుణమాఫీ చేయాలని ఎన్నికల ముందు ఇచ్చి వాగ్దానాన్ని అమలు పర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని ఎంజీఎల్‌ఐ అతిథి గృహ ఆవరణలో నిర్వహించిన సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలోపేతం కోసం కౌన్సిల్ సమావేశంలో పార్టీ నిర్మాణంపై సుదీర్ఘమైన చర్చ కొనసాగించారు. సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా సమితి సభ్యులు కుర్మయ్య, పట్టణ కార్యదర్శి యూసుఫ్, ముల్చింతలపల్లి శాఖ కార్యదర్శి జంగం శివుడు, శంకర్, తిరుపతి, వెంకటమ్మ పాల్గొన్నారు.

'జీవించే స్వేచ్ఛకు విఘాతం కల్గించొద్దు'

బిజినేపల్లి, ఆగస్టు 8 : దేశంలోని ప్రతీ ఒక్కరికి జీవించే స్వేచ్ఛ హక్కుకు విఘాతం కల్గించవద్దని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్ బాబు అన్నారు. మండలంలోని పెద్దతండాలో శుక్రవారం గిరిజన ప్రాంత వాసుల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక సదస్సు నిర్వహించి మాట్లాడారు. గిరిజన తండాలు, అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండటం వల్ల అటవీ జంతువుల దాడితో పశుసంపద, పంట పొలాలు నష్టపోతున్నారని ఆయన దృష్టికి రావడంతో ఎప్పటికప్పుడు నిరుపేదలైన ట్రైబల్స్‌కు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా జీవించే హక్కులో భాగంగా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆహార అలవాట్లపై గిరిజన వాసులకు ఆయన అవగాహన కల్పించారు.

గంగారం సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు

మండలంలోని గంగారంలోని సీతారాముల ఆలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు, జిల్లా న్యాయాధికారి సబిత, ఏజీపీ శ్యాంసుందర్, న్యాయవాదులు కేశవ్ రెడ్డి, శ్రీరామ్ ఆర్యా, బోనాసి రాంచందర్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట తహసీల్దారు శ్రీరాములు, సీఐ కనకయ్య, ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి, ఆర్‌ఐ బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

ఆదివాసి హక్కులు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

- నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లంగొండ్ల రాజు



ప్రధాన కూడలిలో గల ఏకలవ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

లింగాల, ఆగస్టు 9 : ఆదివాసి హక్కులు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని గిరిజన యువతకు గిరిజన చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు ఉల్లంగొండ్ల రాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ధారారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో గల ఏకలవ్య విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న ఆదివాసుల అభ్యున్నతికి కావాల్సిన మార్పులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అదేవిధంగా మండల కేంద్రమైన లింగాలలో ఆదివాసీల దినోత్సవం సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు నల్లగొండ శ్రీనుతో కలిసి పలువురు నాయకులు పూల మాల వేసి ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు, గుత్తి వెంకటయ్య, పూజారి వెంకటయ్య, రిటైర్డు సీఐ వెంకట్రాములు, ఆవుల హనుమంతు, రాయవరం మాజీ సర్పంచ్ మల్లయ్య, శ్రీశైలం, పిరిగే మల్లేష్, నరసింహ, జయన్న, వెంకటేష్, శ్రీను, వెంకటయ్య, కాశన్న, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా చంద్రుడు

వెల్దండ, ఆగస్టు 9 : మండల విద్యాధికారిగా జీ చంద్రుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన శంకర్‌నాయక్‌కు కల్వకుర్తి ఎంఈవోగా బాధ్యతలు అప్పగించగా, మండలంలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న చంద్రుడుకు వెల్దండ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కాగా ఇప్పటికే జిల్లాలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవల్లి, తెల్కపల్లి మండలాలకు ఎంఈవోగా పనిచేస్తున్న చంద్రునికి అదనంగా వెల్దండ బాధ్యతలు అప్పగించారు.

పరిపూర్ణ ఆరోగ్యంతోనే జ్ఞాపకశక్తి మెరుగుదల

బిజినేపల్లి, ఆగస్టు 8 : ఔషధ మొక్కల పెంపుదలతో ప్రతీ ఒక్కరికి పరిపూర్ణ ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి మెరుగుగా ఉంటుందని స్కూల్ ఎర్త్ క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ప్రోగ్రాం అధికారి విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని శాయిన్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఔషధ మొక్కలను అందజేసి పాఠశాల ప్రాంగణంలో మెడిసినల్ గార్డెన్ తయారు చేసి మాట్లాడారు. మాజీ సర్పంచ్ అవంతి శంకర్, ప్రధానోపాధ్యాయుడు మురళి కృష్ణ, ఎర్త్ క్లబ్ మెంటర్ రాజారెడ్డి, రవి ఉన్నారు.

తపాలా పథకాలతో పేదలకు లబ్ధి

పెద్దకొత్తపల్లి : తపాలా పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాలనర సింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొదుపు పథకాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా తపాలా అధికారి సుజన్‌నాయక్ మహెమూద్‌ఖాన్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణుచారి పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం అభివృద్ధికి తోడ్పాటునందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- ఆలయ అధికారులు, సిబ్బందితో సమావేశం

అచ్చంపేట, ఆగస్టు 9: ఉమామహేశ్వర ఆలయ పాలక మండలి పదవీకాలం ఫిబ్రవరిలో ముగియడంతో నూతన కమిటీ బాధ్యతలు తీసుకునేవరకు ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శ్రావణ తొలి శుక్రవారం కావడంతో ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు నూతన పాలక వర్గం ఏర్పాటు జరిగే వరకు భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. మీడియా ఏదైన సమస్య గుర్తిస్తే తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానని లేదంటే పత్రికల్లో వ్యక్తపరచాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆలయ అధివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ఆలయంలో అన్నదానం యధావిధిగా కొనసాగించాలన్నారు. త్వరలో నూతన కమిటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని సమావేశంలో ఉన్న నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు. ఆలయ కమిటీ ఏర్పాటు అధికారిక షెడ్యూల్ రెండు మూడు రోజులలో వెలువడనుందని ఆయన తెలిపారు.

● నాగదేవతలకు పూజలు

నాగుల పంచమి సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు ఉమామహేశ్వర ఆలయంలో ఉమామహేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో ఉన్న నాగదేవతలకు ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ ప్రత్యేక పూజలు చేశారు.

పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందాం

అచ్చంపేటటౌన్: పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీఎస్ఎన్ కాలేజీలో 3కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రతీ ఇల్లు



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 3కె రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రతీ పట్టణం స్వచ్ఛదనంతో పచ్చగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టణంలోని 5వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఆర్డీవో మాధవితో పాటు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు. వర్షాకాలం కాబట్టి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు చెట్టు మూలం

- కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేటటౌన్, ఆగస్టు 9: చెట్టు లేకపోతే జీవమే లేదు జీవకోటి మనుగడకు చెట్టు మూలం చెట్టు లేకపోతే ఏ జీవి జీవించలేదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి అయనతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40లక్షల మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇరిగేషన్ స్థలాలలో చెరువులు, అటవీ భూములలో మొక్కలు నాటడానికి అనువైన స్థలాలు గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామన్నారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తే ప్రకృతిని పరిరక్షించినట్లుగా ఆయన తెలిపారు. ఆర్డీవో మాధవి, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మొక్కలను కాపాడితే మానవాళి మనుగడ

కల్వకుర్తి: నాటిన మొక్కలను సంరక్షిస్తేనే మానవాళి మనుగడ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో తిమ్మరాసిపల్లిలో ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్‌కంట్రోల్ బోర్డు కమిటీ సభ్యులు బాలాజీసింగ్‌లు మొక్కలు నాటారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గౌడ్‌లకు ఈత మొక్కలను పంపిణీ చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహేద్, కమిషనర్ ఆశిత్‌కుమార్, ఆసుపత్రి వైద్యులు శివరాం, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, రవీందర్, ఎజాస్, పలువురు కౌన్సిలర్లు, ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిద్దాం

కొల్లాపూర్: ప్రతి ఒక్కరు సంకల్పంతో మొక్కలు నాటాలని నాటిన మొక్కలను సంరక్షించాలని కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యా పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్, వైస్ చైర్‌పర్సన్ మహెమూదాబేగం, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. అదేవిధంగా ఎల్లూరు రహదారిలో శ్రీమిత్ర కాలనీలో మొక్కలు నాటారు. మునిసిపల్ కౌన్సిలర్లు షేక్.రహీంపాషా, ఎండి.నయీమ్, బరిగెల రాముడు, కాంగ్రెస్ నాయకులు ఖాదర్ పాష, బరిగెల వేణుగోపాల్‌యాదవ్, ఎల్లగౌడ్, ఆశా వర్కర్లు, మెప్మా మహిళా సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

● తాడూరు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని సహాయ సహకారాలతో మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఎక్సైజ్ ఎస్ ఐ రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిం దాయపల్లి, ఎట్టిధార్‌పల్లి గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చద నం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజ రైన ఎక్సైజ్ ఎస్ఐ రాములు ఈత మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో జ్యోతిపరోషియా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ఏపీవో చంద్ర సిద్దార్థ, మహిళా సమాఖ్య, ఉపాధి సిబ్బంది, వైద్య సిబ్బం ది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని రక్షించుకోవాలని ఎంపీడీ వో లక్ష్మీదేవి సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవాలయ ఆవరణలో శుక్రవారం ఏపీవో సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అదేవిధంగా పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించి మురుగునీరు నిల్వ ఉన్న చోట గ్రామపంచాయతీ వైద్య, ఉపాధి హామీ సిబ్బంది ఆశా వర్కర్లతో కలిసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. నీటి ట్యాంకులను శుభ్రపరిచి ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వతో ప్రమాదం..

ఉప్పునుంతల: ఇంటి పరిసరాలలో నీటి నిల్వ ఉండటం వల్ల బ్యాక్టీరియాలతో పాటు దోమలు వృద్ధి చెంది ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్నదని ఎంఎల్‌హెచ్ పి.బిందు అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో వైద్య బృందం ఫ్రై డే సందర్భంగా గ్రామంలో ఇల్లిల్లు తిరిగి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్త రజిత తదితరులు ఉన్నారు.అలాగే, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగేందర్ అన్నారు. స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని రైతువేదిక ఆవరణలో ఎంపీడీవో మోహన్‌లాల్‌తో కలిసి ఆయన వనమహోత్సవం ప్లాంటేషన్‌లో మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. నాయకులు అనంతరెడ్డి, ఏపీవో సుదర్శన్‌గౌడ్, ఈసీ కుర్మారెడ్డి, ఈఏలు ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



మార్కెట్ యార్డులో మొక్క నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

● పెద్దకొత్తపల్లి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దకొత్తపల్లిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ప్రత్యేక అధికారి బైపాల్‌రెడ్డి మొక్కలను నాటారు. డీఎల్‌పీవో శ్రీరాములు, ఎంపీడీవో నాగేంద్ర, ఎంపీవో వెంకటయ్య, ఏవో శిరీష, పంచాయతీ కార్యదర్శి నాగశేషి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీటీ బాలు, ఈసీ రామ్మోహన్, ఏపీవో మంజుల, ఏఈవో ముజీబ్, సీఆర్పీలు ఈశ్వర్, రమేష్‌రెడ్డి, ఐఈఆర్డీ జయప్రకాశ్, కంప్యూటర్ ఆపరేటర్ శివ, విద్యుత్‌లైనింగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌నాయక్, లైన్‌మెన్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలోని పిహెచ్‌సీ వద్ద, మర్రిపల్లిలో డాక్టర్ మంజుభార్గవి, ఎంపీడీవో ఇసాక్ హుసేన్‌లు మొక్కలు నాటారు. ఎంపీవో వెంకటేష్, వీఎల్‌వో షేక్‌మదర్, ఏపీఎం బాలచందర్, ఏపీవో లక్ష్మయ్య, సీహెచ్‌వో శేఖర్‌రెడ్డి, హెచ్‌ఈవో ఎన్టీవీచారి, పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవిశంకర్, ఏఎన్ఎంలు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట ఉన్నత పాఠశాల మైదానంలో మండలాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చేసే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో లక్షణ్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ గౌడ్, ఏపీవో నర్సింహ, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, వైద్య సిబ్బంది ఊర్మిళ, భాగ్య, ఐకేపి సిబ్బంది మాధవి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నాగర్‌కర్నూల్ టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై మొక్కలు నాటారు. కౌన్సిలర్ జక్కా రాజు, సునేంద్ర, కావలి శ్రీను, నిజాం, బాదం రమేష్, సుల్తాన్, పద్మమ్మ, బచ్చన్నయాద వ్, యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్‌గౌడ్, కొంగనా గేష్, పాపమ్మ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో మొక్కలు నాటుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పాల్గొన్న కౌన్సిలర్లు



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



నాగర్‌కర్నూల్ 18వ వార్డులో బోరు ప్రారంభానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల

దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది

- ఎస్పీగైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమని దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతమని దేశ భవిష్యత్తు అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వర్ధం సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సురేష్, సుభాష్, శివ పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం బ్యాంకు వద్ద బారులు



పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచి వద్ద బారులు తీరిన రైతులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 9 : ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని పొందేందుకు రైతులు శుక్రవారం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద బారులు తీరారు. రైతులు అందరు ఒకేసారి తమఖాతా వివరాలు తెలుసుకునేందుకు రా వడంతో బ్యాంకువద్ద తోపులాట నెలకొంది. బ్యాంకు సిబ్బంది రైతుల తాకిడిని తట్టుకోలేక పోలీసులకు సమాచారం ఇవ్వడం.. వారు వచ్చి రైతులకు సర్దిచెప్పి వరుసక్రమంలో రావాలని సూచించడంతో శాంతించారు. వరుసగా రెండు రోజులు బ్యాంకుకు సెలవులు ఉండటంతో రైతులు అధికంగా రావడంతో బ్యాంకువద్ద రద్దీ నెలకొంది. బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది సహాయంతో రోజుకు 50మంది రైతులకు టోకెన్లు జారీ చేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు శాంతించి ఎవరికి వచ్చిన టోకెన్లు వారు తీసుకొని వెళ్లిపోయారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 9 : వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వైద్యులను ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అనస్తీషియా కొరత ఉందని, ల్యాబ్‌టెక్నీషియన్ రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, డయాలసిస్ యూనిట్‌లో రెండు బెడ్లను అదనంగా ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు అందేలా చూడాలని ఎజెండా అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్, మునిసిపల్ వైస్ చైర్మన్ షాహేద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 14న జాతీయ లోక్‌అదాలత్

కొల్లాపూర్, ఆగస్టు 9 : వచ్చే నెల 14న జూనియర్ సివిల్ కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించబడుతుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్ ఆర్‌వీఎస్ఎస్.మిథున్‌తేజ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ లోక్‌అదాలత్ సన్నాహక సమావేశాన్ని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్‌వీఎస్ఎస్.మిథున్‌తేజ, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్నగుంటిలు హాజరై జాతీయ లోక్‌అదాలత్‌లో చేపట్టాల్సిన విజయవంతానికై బార్‌అసోసియేషన్ సభ్యులు, ప్రాసిక్యూషన్ పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడ్డ కేసులను పరిష్కరించబడుతాయని న్యాయాధికారులు పేర్కొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినం



నాగర్‌కర్నూల్‌లో యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు కొడిదెల రాము

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 9 : యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జెండాను జిల్లా అధ్యక్షుడు కొడిదెల రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిగౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సహదేవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగరాజుయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివప్రసాద్, యూత్ కాంగ్రెస్ బిజినేపల్లి పవన్, ప్రెసిడెంట్ శ్రీకాంత్, మంగనూర్ గ్రామ అధ్యక్షుడు శ్రీను, పరుశరామ్, సీనియర్ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

● కల్వకుర్తిటౌన్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ కమాన్‌వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం ముందు శుక్రవారం యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీస బాలరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువజన కాంగ్రెస్ నాయకులు గ్రామీణ, మండల, జిల్లా స్థాయిల్లో కాంగ్రెస్ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మహిళా కాంగ్రెస్ నాయకులను శాలువా, పూలమాలతో సత్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి ర్యాలీగా వెళ్లి ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచి బృంగి ఆనందకుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడు, నాయకులు నానియాదవ్, శేఖర్, సైదులు, గణేష్, సుబాని, పాండురంగారెడ్డి, మాలిక్, శ్రీహరి పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకొని ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. జిల్లా నాయకులు రేణయ్య, మండల నాయకులు భాస్కర్, కుర్మయ్య, గోవింద్‌సింగ్, చెన్నకేశవ్, జనార్దన్, శివశంకర్, శ్రీను, అశోక్, శ్రీనివాసులు, బీమయ్య, రాంబాబు, ఆనంద్, నరేందర్, కిరన్, స్వామి తదితరులు ఉన్నారు.

'దేశాన్ని దోచేస్తున్న కార్పొరేట్లు దేశం విడిచి వెళ్లండి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 9 : భారతదేశాన్ని దోచేస్తున్న కార్పొరేట్లు దేశం విడిచి వెళ్లండని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ చౌక్‌లో సంయుక్త కిసాన్‌మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్, సంయుక్త కిసాన్ మోర్చా కో కన్వీనర్స్ సి.బాల్‌రెడ్డి, కృష్ణాజీ, జిల్లా కమిటీ సభ్యులు వి.వెంకటేశ్, మధు, కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 9 : మండల పరిధిలోని సాతాపూర్ గ్రామానికి చెందిన సారాయి సత్యనారాయణ గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సాతాపూర్ గ్రామ క్రికెట్ టీమ్ యువకులు మృతుని కుటుంబాన్ని సందర్శించి మృతుని భార్య కృష్ణమ్మకు 35వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివరాజేశ్వర్‌రావు, యాదవ సంఘం నాయకులు సరాయి వీరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సరాయి తిరుపతయ్య, నక్క శేఖర్, క్రికెట్ టీమ్ యువకులు మధుచారి, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరజ్ చోప్రా యువ తరానికి స్ఫూర్తి

అమ్రాబాద్, ఆగస్టు 9: ప్యారిస్ ఒలంపిక్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో జావెలిన్‌త్రోతో ప్రతిభ కనబరిచిన నీరజ్ చోప్రాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎడ్మ శ్రీను యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన అమ్రాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ నీరజ్ చోప్రా యొక్క స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

ప్రారంభమైన పీజీ సెమిస్టర్ పరీక్షలు

కొల్లాపూర్, ఆగస్టు 9 : పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో శుక్రవారం ఫైనల్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియత్ వెల్లడించారు. పీజీ సెంటర్‌లో ఎంఏ.తెలుగు, ఇంగ్లీష్, ఎంఎస్సీ మ్యాథ్స్, కామర్స్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారని పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మార్క్ పోలోనియత్ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఆయన పర్యవేక్షించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చారకొండ, ఆగస్టు 9: గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బండపల్లి బాలస్వామి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన చారకొండలో విలేకరులతో మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా గ్రామపంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి నేటి వరకు కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ జంగవారికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పి.శేఖర్, కే శేఖర్, భువన్, యాదయ్య, రాములు, వెల్వయ్య, మల్లయ్య, కృష్ణయ్య లక్ష్మయ్య, రాములమ్మ, కవిత, మొగులమ్మ ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

వంగూరు: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వంగూరులో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఆలాంటి వారికి కనీస వేతనం చెందవల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడూరు: గత కొన్ని నెలలుగా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారిందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ప్రమీల, ఎంపీవో బ్రహ్మచారిలకు వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్మికులు బాలయ్య, ఖైరాత్, సుబ్బయ్య, పరుశరామ్, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.